kalamdaily.com

# కలం

Follow on: Kalamtelugu

మంగళవారం
17-03-2026 పేజీలు: 3

ప్రజల గళం...

360° SINGLE TOPIC

అపోజిషన్ అటెండెన్స్



**ప్రతిపక్షమంటే ప్రభుత్వ తప్పుల్ని ప్రశ్నించేది.. పాలనలోని లోపాలను నిలదీసేది.. ప్రజల తరపున గొంతెత్తి నిలిచేది.. ఇదీ జనంలో ఉండే సాధారణ అభిప్రాయం.**

**కానీ తెలంగాణ, ఏపీలోని ప్రతిపక్ష పార్టీల రూటే సెపరేట్. ప్రతిపక్ష నేతలకు ఆ బాధ్యత పట్టదు. ప్రజల గొంతుకగా ఉండాలన్నా స్పృహే లేదు. అసెంబ్లీ వైపు చూడడమే లేదు. అటెండెన్స్ కోసమే సమావేశాలకు హాజరు. హోదా కోసం, ప్రొటోకాల్ కోసం పాకులాటలో తక్కువేమీ లేదు. క్రమం తప్పకుండా జీతం, అలవెన్సుల్లో తగ్గేదే లేదు. బాధ్యతల్లో మాత్రం డోన్ట్ కేర్.**

**గడిచిన రెండున్నరేండ్లలో ఏడుసార్లు అసెంబ్లీ సెషన్లు జరిగితే ప్రధాన ప్రతిపక్ష నేతగా కేసీఆర్ హాజరైంది మూడింటికే. గతేడాది డిసెంబర్ లాస్ట్ వీక్ సెషన్‌కు అలా వచ్చి.. ఇలా సంతకం పెట్టి.. మూడు నిమిషాలకే వెళ్లిపోయారు. ఆ పార్టీ ఎమ్మెల్యేలూ వాకౌట్లు, బాయ్‌కాట్లతో సరిపెట్టుకుంటున్నారు. మైక్ ఇవ్వడం లేదని, గొంతు నొక్కుతున్నారన్నది వారి వాదన.**

**ఏపీలో జగన్ ధోరణీ ఇంతే. ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వడం లేదని, అందుకే సభకు రావడం లేదన్నది వైసీపీ వాదన. లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా రాహుల్‌గాంధీ పాత్ర కూడా అలాంటిదే. కారణాలెన్ని చెప్పినా ఎంపీల యావరేజ్‌తో పోలిస్తే రాహుల్ గాంధీ అటెండెన్స్ తక్కువే. అయితే.. సభలో ఉన్నంత సేపు మాత్రం ప్రజా సమస్యలపై కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికే సమయాన్ని రాహుల్ ఎక్కువగా ఉపయోగించుకుంటున్నారు. ప్రజల్లోనూ తిరుగుతున్నారు.**

**ప్రతిపక్షాల తీరుపై కలం 360 డిగ్రీస్ కథనం..**

తెలంగాణ బ్యూరో, కలం

# ఇర్రెస్పాన్సిబుల్ అపోజిషన్

## హోదా కావాలి.. బాధ్యతలు వద్దా..?

- అసెంబ్లీకి ప్రతిపక్ష నేతల డుమ్మా .. ఏపీ, తెలంగాణలో కామన్
- రెండున్నరేండ్లలో మూడుసార్లే సభకు హాజరైన కేసీఆర్
- ఆ పార్టీ ఎమ్మెల్యేలదీ అదే బాట.. బాయ్‌కాట్లు, వాకౌట్లు
- ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని అసెంబ్లీ వైపు వెళ్లని జగన్
- లోక్‌సభలో రాహుల్ అటెండెన్స్ యావరేజ్ కంటే తక్కువే



29 డిసెంబర్ 2025

### అలా వచ్చి.. సంతకం పెట్టి.. ఇలా వెళ్లి!

గతేడాది డిసెంబర్ 29.. అసెంబ్లీ శీతాకాల సమావేశాల ప్రారంభం! ఆరోజు ఉదయం సభకు వచ్చిన ప్రతిపక్ష నేత కేసీఆర్.. అందరినీ పలకరించి.. రిజిస్టర్‌లో అటెండెన్స్ వేయించుకొని.. ఆ తర్వాత రెండు నిమిషాలు సభలో ఉండి.. వెళ్లిపోయారు. మొత్తంగా కేవలం 3 నిమిషాలే అసెంబ్లీలో ఉన్నారు.





### కేసీఆర్ వచ్చింది మూడుసార్లే..

తెలంగాణను తొమ్మిదిన్నరేండ్లు పాలించిన కేసీఆర్.. కుర్చీ దిగిపోగానే అసెంబ్లీకి రావడం మానేశారు. ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు. ఈ రెండున్నరేండ్లలో కేవలం మూడే మూడుసార్లు అసెంబ్లీ ముఖం చూశారు. 'సార్ వచ్చుడు.. సంతకం చేసుడు.. వెళ్లిపోవుడు' అన్నట్టుగా కేసీఆర్ తీరు ఉందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- కేసీఆర్ మొదటిసారి 2024 జులై 25న అసెంబ్లీకి హాజరయ్యారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఆర్థికమంత్రి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగం పూర్తయ్యేంత వరకు సభలో ఉన్నారు. ఆ తర్వాత మీడియా పాయింట్ దగ్గర మాట్లాడి వెళ్లిపోయారు.
- రెండోసారి గతేడాది మార్చి 12న బడ్జెట్ సెషన్ ఫస్ట్ డే హాజరయ్యారు. గవర్నర్ ప్రసంగం పూర్తయ్యేంత వరకు ఉండి వెళ్లిపోయారు.
- గతేడాది డిసెంబర్ 29న శీతాకాల సమావేశాల మొదటి రోజున ముచ్చటగా మూడోసారి హాజరయ్యారు. కేవలం మూడు నిమిషాలే సభలో ఉన్నారు. దివంగత ఎమ్మెల్యేల సంతాప తీర్మానాలను స్పీకర్ చదువుతుండగానే వెళ్లిపోయారు.

### మళ్లీ డుమ్మా

ఈ నెల 16 నుంచి రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు గవర్నర్ శివప్రతాప్ శుక్లా ప్రసంగించారు. కానీ మొదటి రోజు అసెంబ్లీకి ప్రతిపక్ష నేత కేసీఆర్ హాజరుకాలేదు. ఆయన బడ్జెట్ స్పీచ్ రోజు హాజరవుతారా? లేదంటే మొత్తానికే గైర్హాజరవుతారా? అన్న డిస్కషన్ నడుస్తున్నది.



## కేసీఆర్ బాటలోనే ఎమ్మెల్యేలు..

బీఆర్ఎస్ అధినేత కేసీఆరే అసెంబ్లీకి రావట్లేదని ఆ పార్టీ ఎమ్మెల్యేలు సైతం డుమ్మా. ఒకవేళ వచ్చినా ఎక్కువసేపు ఉండట్లేదు. మాట్లాడేందుకు స్పీకర్ అవకాశం ఇవ్వడం లేదంటూ ఆందోళనలు, నిరసనలతో సమావేశాల బాయ్‌కాట్.

- ఈ ఏడాది జనవరిలో జరిగిన అసెంబ్లీ శీతాకాల సమావేశాలను బీఆర్ఎస్ బాయ్‌కాట్ చేసింది. తమపై సీఎం అనుచిత వ్యాఖ్యలు చేశారని, తమ మైక్‌లను స్పీకర్ కట్ చేశారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ సభ్యులు ఈ నిర్ణయం తీసుకున్నారు.
- గతేడాది బడ్జెట్ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ సభ్యులు వాకౌట్ చేశారు. 2025 మార్చి 15న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. అయితే ఆ టైమ్‌లో కేసీఆర్‌పై సీఎం అనుచిత వ్యాఖ్యలు చేశారని నిరసనగా సభ నుంచి వెళ్లిపోయారు.
- అంతకుముందు పలు సందర్భాల్లోనూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాకౌట్ చేశారు. రైతు రుణమాఫీ, మూసీ పునరుజ్జీవంపై చర్చ సందర్భంగా సభ నుంచి వెళ్లిపోయారు.

జనవరిలో జరిగిన అసెంబ్లీ శీతాకాల సమావేశాలను బాయ్‌కాట్ చేసి బయటకు వెళ్లిపోతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు



# ప్రతిపక్ష హోదా లేకున్నా.. అటెండైన భట్టి

కేసీఆర్ 2018 ఎన్నికల్లో 88 సీట్లు గెలిచి రెండోసారి అధికారం చేపట్టారు. మ్యాజిక్ ఫిగర్ (60) కంటే 18 సీట్లు అధికంగా బీఆర్ఎస్ గెలుచుకుంది. అయినప్పటికీ నాడు సీఎల్పీని తన పార్టీలో కేసీఆర్ విలీనం చేసుకున్నారు. దీంతో రాష్ట్రంలో ప్రతిపక్షమనేదే లేకుండా చేశారు. సీఎల్పీ విలీనానికి ముందు వరకు ప్రతిపక్ష నేత హోదాలో ఉన్న భట్టి విక్రమార్క.. ఆ తర్వాత ఆ హోదాను కోల్పోయినప్పటికీ సభకు రెగ్యులర్‌గా అటెండ్ అయ్యారు.

- 2019లో 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఒకేసారి బీఆర్ఎస్‌లో చేరారు. కాంగ్రెస్ శాసనసభాపక్షాన్ని బీఆర్ఎస్‌లో విలీనం చేస్తున్నట్టు స్పీకర్‌ను కలిసి లేఖ అందజేశారు. ఆనాడు కాంగ్రెస్‌కు మొత్తం 19 మంది ఎమ్మెల్యేలు ఉండగా, మూడింట రెండొంతుల మంది బయటకు రావడంతో కాంగ్రెస్ శాసనసభాపక్షం బీఆర్ఎస్‌లో విలీనమైనట్టు స్పీకర్ ప్రకటించారు.
- బీఆర్ఎస్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేల చేరికతో భట్టి విక్రమార్క ప్రతిపక్ష నేత హోదాను కోల్పోయారు. అయినప్పటికీ ఆనాడు తనతో మిగిలిన ఎమ్మెల్యేలతో కలిసి ఆయన ఒంటరి పోరాటం చేశారు. ప్రతిపక్ష నేత హోదా లేదని అసెంబ్లీకి రాకుండా ఉండలేదు. అధికార పక్షాన్ని దీటుగా ఎదుర్కొని, సభలో ప్రజా సమస్యలను ప్రస్తావించారు.



తెలంగాణ తొలి ప్రతిపక్ష నేతగా జానారెడ్డి ఉన్నారు. 2014 - 18 వరకు జరిగిన అసెంబ్లీ సమావేశాలకు చాలావరకు ఆయన హాజరయ్యారు. బడ్జెట్ చర్చల్లో పాల్గొన్నారు. రైతు సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.



# తెలంగాణ ఎమ్మెల్యేల జీతం రూ. 2.50 లక్షలు

*దేశంలో ఎమ్మెల్యేలకు అత్యధిక జీతాలున్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. రాష్ట్రంలో ఒక్కో ఎమ్మెల్యేకు నెలకు రూ.2.50 లక్షల జీతం అందుతున్నది. దీనికి అలవెన్సులు అదనం.*

- తెలంగాణ ఎమ్మెల్యేల బేసిక్ జీతం రూ.20 వేలు. నియోజకవర్గ అలవెన్స్ రూ.2.30 లక్షలు.
- హైదరాబాద్‌లో ఫ్రీ క్వార్టర్స్. కరెంట్, వాటర్‌కు నో చార్జీలు.
- ఒకవేళ ఎమ్మెల్యే క్వార్టర్స్ వాడుకోకపోతే అకామిడేషన్ అలవెన్స్ కింద నెలకు రూ.25 వేలు.
- అసెంబ్లీ సమావేశాల టైమ్‌లో డెయిలీ అలవెన్స్ కింద రోజుకు రూ.వెయ్యి.
- ట్రావెల్ అలవెన్స్ అదనం. ఆర్టీసీ బస్సుల్లో ఎమ్మెల్యే, ఎమ్మెల్యే భర్త/భార్యకు ఫ్రీ జర్నీ.
- ఎమ్మెల్యే సహా కుటుంబ సభ్యులందరికీ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఫ్రీ మెడికల్ ట్రీట్‌మెంట్.
- ప్రభుత్వం తరఫున పర్సనల్ అసిస్టెంట్ కేటాయింపు.
- కారు కొనుగోలు కోసం రూ.30 లక్షల లోన్ ఫెసిలిటీ. కేవలం 4% వడ్డీకే .
- మాజీ ఎమ్మెల్యేలకు నెలకు రూ.50 వేల నుంచి రూ.70 వేల పింఛన్. వాళ్లు ఎంతకాలం ఎమ్మెల్యేగా పనిచేశారనే దానిపై ఆధారపడి పింఛన్ లెక్కింపు.
- ఒకవేళ ఎమ్మెల్యే మరణిస్తే భార్య/భర్తకు అంతే మొత్తం పింఛన్.



# ఏపీలోనూ అంతే..



ఏపీ అసెంబ్లీలో పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. అధికార, ప్రతిపక్షాల మధ్య ఎప్పుడూ తిట్ల యుద్ధమే. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అటు జగన్, ఇటు చంద్రబాబుపై విమర్శల దాడి జరిగింది. ఆనాడు చంద్రబాబు అసెంబ్లీని విడిచి వెళ్లగా, నేడు జగన్ అసెంబ్లీ ముఖమే చూడట్లేదు.

- ఏపీలో 2019లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ ఘన విజయం సాధించి వైఎస్ జగన్ సీఎం అయ్యారు. 2021 నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో చంద్రబాబు టార్గెట్‌గా వైసీపీ నేతలు విమర్శలు చేశారు. తనను, తన కుటుంబాన్ని అవమానించారని చంద్రబాబు అసెంబ్లీ నుంచి వెళ్లిపోయారు. మళ్లీ గెలిచాకే సీఎంగా తిరిగి వస్తానని శపథం చేశారు. దాదాపు రెండున్నరేండ్లు అసెంబ్లీలో అడుగుపెట్టలేదు.
- 2024 అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ అధికారం కోల్పోయింది. 151 సీట్ల నుంచి కేవలం 11 సీట్లకు పరిమితమైంది. పార్టీ చీఫ్ జగన్‌కు ప్రతిపక్ష నేత హోదా కూడా దక్కలేదు.
- వైఎస్ జగన్ కూడా కేసీఆర్ బాటలోనే నడుస్తూ.. అధికారం కోల్పోయిన తర్వాత అసెంబ్లీకి వెళ్లడం లేదు. ప్రతిపక్ష నేత హోదా ఇస్తేనే అసెంబ్లీకి వస్తానని ఆయన అంటున్నారు.
ప్రతిపక్ష హోదాకు తగ్గట్టు సీట్లు రాకున్నా దానికోసం పట్టుబడుతున్నారు.

### వైఎస్ జగన్ అటెండెన్స్ వివరాలు

**ఫస్ట్ టైమ్ హాజరు :**

- అధికారం కోల్పోయిన తర్వాత ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయడానికి 2024 జూన్ 21న అటెండ్. ఆ మరుసటి రోజున స్పీకర్ ఎన్నిక సందర్భంగా హాజరు. అసెంబ్లీలో ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఆయన కనిపించడం అదే ఫస్ట్ టైమ్.
- 2024 జూలైలో జరిగిన అసెంబ్లీ మాన్‌సూన్ సెషన్ మొత్తానికే (ఐదు రోజులు జరిగింది) జగన్ ఆబ్సెంట్.
- 2024 నవంబరులో పది రోజుల పాటు జరిగిన శీతాకాల సమావేశాలకు సైతం జగన్ గైర్హాజరు. బాయ్‌కాట్ చేస్తున్నట్లు ప్రకటించిన వైసీపీ.

**సెకండ్ టైమ్ అటెండ్ :**

- 2025 ఫిబ్రవరిలో జరిగిన బడ్జెట్ సెషన్‌లో ఫిబ్రవరి 24న (ఫస్ట్ డే) హాజరు. ఆ తర్వాత నుంచి గైర్హాజరే.
- ఆ తర్వాత 2025 సెప్టెంబరు 18 నుంచి ఎనిమిది సిట్టింగ్ డేస్‌తో జరిగిన శీతాకాల సమావేశాలకూ జగన్ డుమ్మా.

**థర్డ్ టైమ్ సర్‌ప్రైజ్ :**

- ఈ ఏడాది గత నెల 11 నుంచి జరిగిన బడ్జెట్ సమావేశాల్లో గవర్నర్ ప్రసంగం రోజున హాజరై పది నిమిషాల్లోనే వాపస్. ప్రధాన ప్రతిపక్ష హోదా ఇవ్వలేదనే అసంతృప్తి, డిమాండ్ చేసినా స్పీకర్ నిర్లక్ష్యం చేశారనే ఆరోపణతో బాయ్‌కాట్ చేస్తున్నట్లు ప్రకటించిన వైసీపీ.
- 2024లో 17 సిట్టింగ్ డేస్‌లో ఒక రోజు, 2025లో 23 రోజుల్లో ఒక రోజు, 2026లో 15 రోజుల్లో ఒక రోజు మాత్రమే జగన్ హాజరు.

### నో వర్క్.. నో పే



చట్ట సభల్లోనూ 'నో వర్క్.. నో పే' విధానం తీసుకురావాలి. అందుకు చట్టం చేయాలి. 2024 ఎన్నికల తర్వాత అసెంబ్లీకి ఒక్కరోజు కూడా రానివారు ఉన్నారు. వాళ్లు ప్రజలకు అన్యాయం చేస్తున్నారు. సభకు రానివారిని రీకాల్ చేసే హక్కు ప్రజలకు ఉండాలి.

- అయ్యన్న పాత్రుడు, ఏపీ స్పీకర్

# రాహుల్ హాజరు అంతంతే..



లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపైనా విమర్శలు వస్తున్నాయి. ఆయన కీలకమైన చర్చల్లో పాల్గొనడం లేదని, లోక్‌సభకు రాకుండా ఫారిన్ టూర్లకు వెళ్తున్నారని బీజేపీ నేతలు విమర్శలు గుప్పిస్తున్నారు. 'సభకు హాజరయ్యేది తక్కువ.. విదేశాల్లో ఉండేది ఎక్కువ' అంటూ రాహుల్‌పై అమిత్ షా ఇటీవల కామెంట్ చేశారు. ఆయన హాజరు శాతం, విదేశీ పర్యటనల వివరాలను లోక్‌సభలో వెల్లడించారు. మరోవైపు రాహుల్‌కు సభలో మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదంటూ కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు.

- రాహుల్ హాజరు శాతం నేషనల్ యావరేజ్ కంటే తక్కువగా ఉంది. గత లోక్‌సభ (17వ) టర్మ్‌లో రాహుల్ అటెండెన్స్ 51 శాతం. కానీ అప్పుడు జాతీయ సగటు 66 శాతం.
- 16వ లోక్‌సభలో రాహుల్ హాజరు 52% అయితే, నేషనల్ యావరేజ్ 80%. 15వ లోక్‌సభలో ఆయన హాజరు 43% అయితే, నేషనల్ యావరేజ్ 76%.
- ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌పై చర్చలో రాహుల్ పాల్గొనలేదు. 16వ లోక్‌సభ టర్మ్‌లో బడ్జెట్‌పై జరిగిన ఏ చర్చకూ హాజరుకాలేదు.
- హాజరు శాతం తక్కువగా ఉన్నప్పటికీ.. సభలో రాహుల్ గాంధీ తనకు మైక్ దొరికినప్పుడల్లా తాను లేవనెత్తే ఇష్యూస్ చుట్టే సభ మూడ్ అటెన్షన్ లో ఉండేలా చూసుకుంటున్నారు. ప్రధాని మోదీతో పాటు కేంద్ర మంత్రులను ప్రజా సమస్యలపై ఆయన నిలదీయడంలో సక్సెస్ అవుతున్నారు. జోడో యాత్రలు అంటూ దేశవ్యాప్తంగా పర్యటిస్తూ ప్రజా సమస్యలు తెలుసుకుంటున్నారు.

### సభ టైమ్‌లోనే రాహుల్ టూర్లు..



రాహుల్‌ను సభలో మాట్లాడనివ్వడం లేదనేది అబద్ధం. కీలకమైన సమావేశాల సమయంలో ఆయన విదేశాలకు వెళ్లిపోతుంటారు. బడ్జెట్ సహా కీలకమైన అంశాల చర్చల నుంచి తప్పించుకుంటారు. ఎందుకంటే పార్లమెంట్‌లో మాట్లాడాలని రాహుల్‌కు ఉండదు. ఆయన మొత్తం 60 రోజులు విదేశాల్లో పర్యటించారు. జర్మనీ, వియత్నాం, ఇంగ్లండ్, సింగపూర్, మలేసియా తదితర దేశాలను సందర్శించారు.

- అమిత్ షా, కేంద్ర హోంమంత్రి

# తమిళనాడులో అపోజిషన్ ఇన్ ఆబ్సెంటియా

తమిళనాడులోనూ ప్రతిపక్ష నేతలు తమ బాధ్యతను సరిగా నిర్వర్తించడం లేదన్న విమర్శలు ఎప్పటి నుంచో ఉన్నాయి. కరుణానిధి మొదలు ఎంజీఆర్, జయలలిత, విజయకాంత్, స్టాలిన్, పలనిస్వామి వరకు ఈ విమర్శలను ఎదుర్కొన్నారు. అందుకే ఆ రాష్ట్రంలో 'అపోజిషన్ ఇన్ ఆబ్సెంటియా' అనే కామెంట్ తరచూ వినిపిస్తుంటుంది.

### నాలుగేండ్లు సైన్ చేసి వెళ్లిపోయిన ఎంజీఆర్

- కరుణానిధితో విభేదాల కారణంగా డీఎంకే నుంచి బయటకొచ్చిన ఎంజీఆర్ అన్నాడీఎంకే పార్టీని స్థాపించారు. ఆనాడు ఆయన ప్రధాన ప్రతిపక్ష నేత కాదు.. కానీ, ప్రతిపక్షంలో ఉన్నారు. 1972లో కరుణానిధి ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టారు. అయితే ఆ తీర్మానంపై అసెంబ్లీలో ఎంజీఆర్ మాట్లాడుతుండగా మైక్ కట్ చేశారు. అయినప్పటికీ ఆయన దాదాపు రెండు గంటలు అలాగే మాట్లాడారు. అనంతరం అసెంబ్లీ బయటకు వచ్చి.. తాను ఇక అసెంబ్లీకి రానని, మళ్లీ సీఎంగానే తిరిగొస్తానని ప్రకటించారు. దీంతో దాదాపు నాలుగేండ్ల పాటు అసెంబ్లీ రిజిస్టర్‌లో కేవలం సంతకం చేసి వెళ్లిపోయారు.

### రెండేండ్లు అసెంబ్లీ చూడని జయలలిత

- ఎంజీఆర్ మరణానంతరం అన్నాడీఎంకేను జయలలిత నడిపించారు. 1989 ఎన్నికల్లో డీఎంకే గెలిచి కరుణానిధి సీఎం అయ్యారు. అప్పుడు జయలలిత ప్రధాన ప్రతిపక్ష నేత. అదే ఏడాది కరుణానిధి సర్కార్ బడ్జెట్ ప్రవేశపెట్టిన టైమ్‌లో అసెంబ్లీలో జయలలితపై దాడి జరిగింది. చినిగిన చీరతో అసెంబ్లీ బయటకొచ్చిన ఆమె.. తిరిగి సీఎంగానే అసెంబ్లీలో అడుగుపెడతానని శపథం చేశారు. ఆ తర్వాత రెండేండ్ల పాటు అసెంబ్లీకి రాలేదు. 1991లో గెలిచి సీఎం అయ్యారు.
- 1996లో డీఎంకే గెలిచి కరుణానిధి మళ్లీ సీఎం అయ్యారు. ఆ టైమ్‌లో జయలలిత చాలా వరకు అసెంబ్లీకి రాలేదు.

### కరుణానిధీ.. సంతకాల వరకే!

- జయలలిత సీఎంగా ఉన్న టైమ్‌లో కరుణానిధి ప్రధాన ప్రతిపక్ష నేతగా లేరు. కానీ ఆ సమయాల్లో ఆయన చాలా వరకు అసెంబ్లీకి వెళ్లలేదు. కేవలం రిజిస్టర్‌లో సంతకం చేసి వెళ్లేవారు.
- ప్రతిపక్ష నేతగా చేసిన విజయకాంత్ హాజరు కూడా తక్కువ శాతమే ఉంది.
- ప్రతిపక్ష నేతలుగా స్టాలిన్, పలనిస్వామి అసెంబ్లీకి వచ్చినప్పటికీ.. చాలా సందర్భాల్లో ఆందోళనలు వాకౌట్లు చేశారు.





